సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఆచంట విజయ నరేష్, మమత శ్రావణి దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడ) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.

'మెడి'కల సాకారం



ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో శుక్రవారం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి.

II లో

న్యూస్‌రీల్

రూ.18 లక్షలతో వసంత మండపం పునర్నిర్మాణం



అంతర్వేది దేవస్థానంలో శిథిలమైన వసంత మండపం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలో పూర్తి శిథిల స్థితికి చేరుకున్న వసంత మండపం పునర్నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు ఈ నెల 7వ తేదీన శంకుస్థాపన చేయనున్నామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. అంతర్వేది ఆలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏటా ఫిబ్రవరిలో నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం అనంతరం స్వామి వారు వసంత మండపంలో సేద తీరుతారని, ఇది కాలక్రమంలో పూర్తిగా శిథిలమైందని చెప్పారు. అదే చోట రాతితో మండపం పునర్నిర్మాణానికి రూ.18 లక్షలతో ప్రణాళిక, అంచనాలు రూపొందించామని చెప్పారు. అమలాపురం ఆర్‌డీఓ, దేవస్థానం గ్రాంట్ల నుంచి చెరో రూ.9 లక్షలు సమకూర్చామని సత్యనారాయణ తెలిపారు.

పీహెచ్‌సీలకు ఓఎన్‌జీసీ చేయూత

ముమ్మిడివరం: జిల్లాలోని పీహెచ్‌సీలకు ఓఎన్‌జీసీ ఉచితంగా వైద్య పరికరాలు అందిస్తోంది. ఇందులో భాగంగా ముమ్మిడివరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా సమక్షంలో ఆ సంస్థ సుమారు రూ.34 లక్షలతో బేబీ వార్మర్లు, మల్టీ పారా మానిటర్లు, సీటీసీ మెషీన్లు తదితర వైద్య పరికరాలను శుక్రవారం అందజేసింది. ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడం, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వీటిని సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ గ్రూపు జనరల్ మేనేజర్ ప్రభాల్‌సేన్ గుప్తా, మెడికల్ ఇన్‌చార్జి ధర్మేంద్ర కుమార్, చీఫ్ మేనేజర్ ఆర్.శంకర్, సాహెబ్‌దార్ అన్వర్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, డీఎంహెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, సీహెచ్ భరతలక్ష్మి, టీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చవితి ఉత్సవ సంరంభానికి శ్రీకారం



పందిరి రాట పాతుతున్న శ్రీనివాసరాజు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పందిరి రాట ముహూర్తంతో చవితి ఉత్సవాల ఏర్పాట్లకు సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈసారి చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రధానార్చకుడు సూర్యనారాయణమూర్తి, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ పందిరి రాట పాతారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చని సీమపై.. ప్రగతి సంతకం





అలమూరు మండలం బడుగువానిలంకలో గ్రోయిన్, రివిట్‌మెంట్ నిర్మాణం

- వైఎస్సార్ ఆరంభించిన ఉచిత విద్యుత్, పావలా వడ్డీ రాయితీతో రైతులకు మేలు
- ఆయన హయాంలోనే డెల్టా ఆధునీకరణకు శ్రీకారం
- ఏటిగట్ల పటిష్టత పనులూ మొదలు
- పేద రోగుల ప్రాణాలు నిలిపిన ఆరోగ్యశ్రీ
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నిర్విఘ్నంగా పేద విద్యార్థుల చదువులు
- నేడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

సాక్షి, అమలాపురం: గలగలా పారే నీటిలో.. పసిడి గింజల్ని ప్రసవించే ఆకుపచ్చని పైరులో.. ఈ నేలపై ఎటు చూసినా ఆ మహానేత అడుగుజాడలే. అన్నదాత బాగు కోసం పరితపించారు. విద్యార్థులకు ఎవ్వరూ ఊహించని భవిష్యత్తును అందించారు. ముదిమితో, అనారోగ్యంతో ఆశలుడిగిపోయిన జీవితాలకు కొత్త ఊపిరి అందించారు. రేపటి పౌరులకు బంగారు భవిష్యత్తును అందించారు. సంక్షేమ పుస్తకంపై ఎప్పటికీ చెరగని సంతకం చేశారు. అందమైన పంచెకట్టు.. తలపాగా.. చెరగని చిరునవ్వు.. అచ్చం పదహారణాల తెలుగు రైతును పోలిన ఆహార్యంతో.. అందరిలో ఎంతో ధైర్యం నింపిన ఆ దివంగత నేత.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నేడు. చివరి వరకూ ప్రజల బాగు కోసమే శ్వాసించిన ఆయన.. ఆఖరి ఊపిరి విడిచి పద్నాలుగేళ్లు దాటింది. ఇప్పటికీ ప్రజల హృదయాల్లో ఆయన స్మృతి కదలాడుతూనే ఉంది. విభిన్న, వినూత్న సంక్షేమ పథకాలు, మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లాపై ఆయన చెక్కు చెదరని ముద్ర వేసుకున్నారు.

నేటికీ ఆగని ఉచిత విద్యుత్

ఉమ్మడి రాష్ట్రంలో రైతులు సాగునీటి కోసం పడుతున్న కష్టాలను నాటి ప్రతిపక్ష నేతగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా చూశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత విద్యుత్ అందిస్తానని మాట ఇచ్చారు. సీఎం కాగానే తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పై చేశారు. జిల్లాలోని కొబ్బరి, అరటి, పసుపు, కూరగాయల రైతులతో పాటు వరి రైతులకు సైతం ఈ పథకంతో మేలు జరుగుతోంది. జిల్లాలో మొత్తం 20,452 వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉండగా, వీటిలో 11,901 పంపు సెట్లకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఈ పథకం మాత్రం నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది.

రైతుకు కష్టం రానివ్వకుండా..

పావలా వడ్డీ రుణాలతో రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేశారు. రబీకి నీటి ఎద్దడి ఏర్పడిన సమయంలో రూ.7.50 కోట్లతో నివారణ చర్యలు తీసుకున్నారు. 2007లో కొబ్బరి సంక్షోభంలో ఉన్న సమయంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఎండు కొబ్బరిపై ఉన్న 2 శాతం వ్యాట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. మరో సందర్భంలో కేజీ రూ.9.20 చేసి పచ్చి కొబ్బరి కాయను మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేయించారు.

- ఒక్క రైతుల విషయంలోనే కాదు.. 108, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు పక్కా ఇళ్లు, పింఛన్ల పెంపు, కొత్తగా వేలాది మందికి పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను వైఎస్సార్ ప్రవేశపెట్టారు.

వరదల నుంచి రక్షణ కుడ్యం

2006 ఆగస్టులో గోదావరికి భారీ వరదలు వచ్చాయి. అయినవిల్లి మండలం శానపల్లిలంక, పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఏటిగట్లు తెగిపోయి పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగింది. అంతకుముందున్న సీఎంల మాదిరిగా వైఎస్సార్ బాధితులను పరామర్శించి, పరిహారం ఇచ్చి సరిపెట్టలేదు. వరదల పీడ నుంచి ఇక్కడి ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఏటిగట్ల పటిష్ట పనులకు రూ.550 కోట్లు కేటాయించారు. గత ఏడాది గోదావరికి మూడో అతి పెద్ద వరద వచ్చినా గట్ల వద్ద ఎటువంటి ప్రమాదాలూ జరగలేదంటే అందుకు వైఎస్సార్ తీసుకున్న చర్యలే కారణం. లంక కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల పనులకు రూ.90 కోట్లు కేటాయించారు. అన్నంపల్లి అక్విడెక్టు పునర్నిర్మాణం చేపట్టారు.

డెల్టా ఆధునీకరణ



డెల్టా ఆధునీకరణ పనులు

వైఎస్సార్ అనగానే గుర్తుకు వచ్చేది జలయజ్ఞం. దీనిలో భాగంగా గోదావరి డెల్టా రైతులకు నేరుగా ప్రయోజనం అందదని వైఎస్సార్ భావించారు. ఈ నేపథ్యంలో గోదావరి డెల్టా ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. రూ.1,160 కోట్లతో పంట కాలువలు, రూ.550 కోట్లతో మురుగునీటి కాలువల ఆధునీకరణ పనులు చేపట్టారు. జిల్లాలోని తూర్పు డెల్టా పరిధిలో రూ.70 కోట్లతో కాకినాడ, మండపేట కాలువల ఆధునీకరణ పనులు పక్కాగా నిర్వహించారు. మధ్య డెల్టా పరిధిలోని పి.గన్నవరం కాలువలకు రూ.200 కోట్లు, ముక్తేశ్వరం కాలువపై కుండలేశ్వరం నుంచి బలుసుతిప్ప వరకూ కాలువ పనులకు రూ.70 కోట్ల పనులకు టెండర్లు ఖరారు చేశారు.

ఆ మహనీయుని వల్లనే..



నాకు గుండె సమస్య ఉండేది. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయలేని దుస్థితిలో ఆ మహనీయుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ నన్ను ఆదుకుంది. ఆ రోజుల్లో రూ.లక్ష వరకూ ఖర్చయ్యే గుండె శస్త్రచికిత్సను నాకు ఉచితంగా చేశారు. నేను ఆస్పత్రిలో ఉండగా నాటి సీఎం వైఎస్సార్ ఫోన్ చేసి, ఆస్పత్రి సిబ్బంది ఎలా చూసుకుంటున్నారని అడిగి నా బాగోగులు తెలుసుకున్నారు.

– బొంతు సత్యనారాయణ, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

సగం గ్రామం గోదావరిలో కలిసిపోయేది



నాడు వైఎస్సార్ హయాంలో రూ.6.50 కోట్లతో నిర్మించిన గ్రోయిన్లతో లంక భూముల కోత చాలా వరకూ ఆగింది. నాడు ఆ గ్రోయిన్లు నిర్మించకపోతే బడుగువానిలంక సగం గోదావరిలో కలిసిపోయేది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కోత ఉంది. అక్కడ కూడా రివిట్‌మెంట్లు, గ్రోయిన్లు నిర్మించాల్సి ఉంది.

– దూలం సత్తిబాబు, బడుగువానిలంక, ఆలమూరు మండలం

ఆయన ఉండుంటే.. డెల్టా పనులు పూర్తి



వైఎస్సార్ బతికి ఉంటే డెల్టా ఆధునీకరణ వంద శాతం పూర్తయ్యేది. కాటన్ తరువాత కాలువల ఆధునీకరణకు అంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది వైఎస్సార్ ఒక్కరే. ఆ మహానేత మృతి అనంతరం ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు.

– సత్తి శ్రీనివాస్, వైస్ చైర్మన్, గోదావరి ప్రాజెక్ట్ కమిటీ, నవరప్పాలెం, అమలాపురం మండలం

కౌలు రైతులకూ వైఎస్సార్ రైతు భరోసా

- జిల్లా వ్యాప్తంగా 5,505 మందికి మేలు
- రూ.4,12,87,500 మేర లబ్ధి
- 5,123 మంది వరద బాధిత రైతులకూ రూ.3 కోట్ల పరిహారం
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



కౌలు రైతులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం రూరల్: భూ యజమానుల మాదిరిగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతుభరోసా నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పంట రుణ అర్హత కార్డులు కలిగిన కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వర్చువల్ విధానంలో బటన్ నొక్కి జమ చేశారు. కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కౌలు రైతులనుద్దేశించి మాట్లాడుతూ, 2023–24 సీజన్‌కు సంబంధించి తొలి విడత వైఎస్సార్ రైతుభరోసా నిధులను ఒక్కొక్కరి ఖాతాలో రూ.7,500 చొప్పున సీఎం జమ చేశారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులతో పాటు ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.13,500 చొప్పున ప్రభుత్వం 2019 అక్టోబర్ 15 నుంచి వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం–2006 గిరిజన రైతు సాగుదారులు, దేవదాయ భూములు సాగు చేసే వారు కూడా ఈ పథకానికి అర్హులని అన్నారు. జిల్లాలో 5,213 మంది కౌలు రైతులు, దేవదాయ భూములు సాగు చేస్తున్న వారు 292 మంది ఉన్నారని చెప్పారు. వరుసగా ఐదో ఏడాది కూడా జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,505 మంది కౌలు రైతులకు రూ.4,12,87,500 మేర రైతు భరోసా కింద ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించిందని అన్నారు.

వరద బాధిత రైతులకు పరిహారం

గత జూలై నెలలో గోదావరి వరదలు, భారీ వర్షాలతో ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు కూడా ప్రభుత్వం పరిహారం అందించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. వరదలకు జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 51 గ్రామాల్లో 5,123 రైతులకు చెందిన 1,584 విస్తీర్ణంలో అరటి, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పూలు, తమలపాకు తదితర ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయన్నారు. వీరికి పెట్టుబడి రాయితీగా రూ.3,00,44,095 ప్రభుత్వం జమ చేసింది. ఇటీవల భారీ వర్షాలు, గోదావరి వరదలతో నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటించి, బాధితులకు భరోసా కల్పించారన్నారు. అతి తక్కువ సమయంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి, బాధిత రైతులను ఆదుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోటూరి సాయి, ఆచార్య ఎన్‌జీ రంగా ఉద్యాన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు ఎ.బోసుబాబు బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చిట్టబ్బాయి సేవలు చిరస్మరణీయం

- రాజకీయ విలువలున్న వ్యక్తి చిట్టబ్బాయి
- జయంతి సభలో మంత్రి విశ్వరూప్



చిట్టబ్బాయి జయంతి సభలో కేక్ కట్ చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: దివంగత కుడుపూడి చిట్టబ్బాయి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిస్వార్థంగా అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మాజీ పీఏసీ సభ్యుడు దివంగత కుడుపూడి చిట్టబ్బాయి 75వ జయంతి స్థానిక హైస్కూల్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (బులినాని) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడారు. చిట్టబ్బాయి రాజకీయ విలువలున్న వ్యక్తి అని కొనియాడారు. మంత్రితో పాటు ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, చిట్టబ్బాయి కుటుంబానికి పార్టీతో పాటు తామంతా అండగా ఉంటామని అన్నారు. అనంతరం చిట్టబ్బాయి జయంతి కేక్‌ను అతిథులు కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిట్టబ్బాయి సతీమణి అరుణ, కుమారుడు, పార్టీ నాయకుడు భరత్ భూషణ్, కోడలు, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ కూడా ప్రసంగించారు. తొలుత అతిథులు హైస్కూలు సెంటర్‌లోని చిట్టబ్బాయి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. తొలుత స్థానిక సూర్యనగర్‌లోని చిట్టబ్బాయి ఇంటికి అతిథులు, పార్టీ నాయకులు వెళ్లి, ఆయన కుటుంబీకులతో కొద్దిసేపు గడిపారు. చిట్టబ్బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మా మంచి మా'స్టార్లు'

పి.గన్నవరం/కె.గంగవరం/ఆత్రేయపురం: పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా బోధిస్తారు.. వారిలో స్ఫూర్తిని నింపుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేస్తారు.. సేవా కార్యక్రమాలు చేపడతారు.. పని చేస్తున్న పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తారు.. ఒక్క మాటలో చెప్పాలంటే 'మా మంచి మాస్టార్లు' అనిపించుకుంటున్నారు. వారి కృషిని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5– ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి ప్రభుత్వం ఈ పురస్కారం ప్రదానం చేయనుంది. ఈ పురస్కారానికి జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారిని తోటి ఉపాధ్యాయులతో పాటు పలువురు అభినందిస్తున్నారు.

మెరుగైన బోధనతో..



పి.గన్నవరం మండలంలోని నరేంద్రపురం జెడ్పీ హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కంభంపాటి సూర్యనారాయణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. బయోలాజికల్ సైన్స్ బోధిస్తున్న ఆయన 1989 నుంచి వివిధ స్కూళ్లలో పని చేస్తూ వందలాది మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారు. సూర్యనారాయణ 2005లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఇన్‌స్పైర్ మానక్ సైన్స్‌ఫేర్ ప్రాజెక్టుల ప్రదర్శనలో డివిజన్ స్థాయిలో తొమ్మిదిసార్లు, జిల్లా స్థాయిలో ఐదుసార్లు, రాష్ట్ర స్థాయిలో ఒకసారి ప్రథమ స్థానాలు సాధించారు. జాతీయ స్థాయిలో ఒకసారి ఉత్తమ ప్రాజెక్టు అవార్డు అందుకున్నారు. 'విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు కష్టపడి పని చేస్తాను. నా కష్టాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు గుర్తించి, అభినందించేవారు. ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది. ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసిన అధికారులకు, ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు' అని సూర్యనారాయణ చెప్పారు.

సంతోషంగా ఉంది



కె.గంగవరం మండలం దంగేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న నేతునూరు రాజు రాష్ట్ర ఉత్తమ హెచ్‌ఎం పురస్కారానికి ఎంపికయ్యారు. గతంలో ఆలమూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసినప్పుడు దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు, పాఠశాల అభివృద్ధికి వివిధ పనులు చేపట్టారు. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో సోషల్ సిలబస్‌కు సంబంధించి రిసోర్స్ పర్సన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆలమూరు నుంచి ఇటీవల దంగేరు బదిలీ అయ్యారు. రాష్ట్ర స్థాయి పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని అంటూ ప్రభుత్వానికి రాజు కృతజ్ఞతలు తెలిపారు. మరింత ఉత్సాహంతో పని చేసి, అందరి మన్ననలూ పొందుతానని చెప్పారు.

గుణాత్మక విద్య అందిస్తూ..



ఆత్రేయపురం మండలం రాజవరంలోని మండల ప్రజాపరిషత్ ప్రధాన ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న పి.శాంతిజ్యోతి కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆమె.. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నారు. అనేక శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. శాంతిజ్యోతిని ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓలు వి.వరప్రసాద్, సాహెబ్ అభినందించారు.

ముత్యాలమ్మ వారికి రూ.2.6 లక్షల ఆభరణాల బహూకరణ



అమ్మవారి సన్నిధిలో మురళీకృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు

మండపేట: మండలంలోని మెర్నిపాడులో వేంచేసియున్న ముత్యాలమ్మ వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గారపాటి మురళీకృష్ణ, గారపాటి అశోక్‌కుమార్ సోదరుల ఆధ్వర్యాన అమ్మవారికి ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు, పుష్పార్చనలు నిర్వహించారు. మెర్నిపాడు గ్రామానికి చెందిన వల్లూరి శ్రీనివాసరావు దంపతులు రూ.1.8 లక్షల విలువైన రెండు కిలోల వెండి తొడుగు, గారపాటి మురళీకృష్ణ దంపతులు రూ.80 వేల విలువైన బంగారు కాసుల పేరును అమ్మవారికి బహూకరించారు. వేడుకల్లో భాగంగా 5 వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ మండల కన్వీనర్ ఉప్పులూరి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండపేట రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, పాలతోడు, మారేడుబాక గ్రామ కమిటీల అధ్యక్షులు పిల్లా అరవరాజు, తోరం శ్రీనివాస్, వెలగతోడు సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు ముత్యాల రామారావు, గారపాటి శ్రీసతీష్, యలమాటి సతీష్, పంపన బుల్లియ్యా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీహెచ్‌సీల్లో గుండె జబ్బుల ప్రథమ చికిత్స

- ఫైలట్ ప్రాజెక్టుగా అమలు
- తూర్పు గోదావరి కలెక్టర్ మాధవీలత


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గుండె పోటుకు గురైన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. సీహెచ్‌సీల్లో గుండె వ్యాధులకు ప్రథమ చికిత్స చేసే పైలట్ ప్రాజెక్టును ఈ నెలలో జిల్లాలో ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని మయో కార్డియల్ ఇన్ఫార్షన్, ఎస్‌టీ ఎలివేషన్‌పై వైద్యులు, స్టాఫ్ నర్సులకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఆహార అలవాట్లు, ఒత్తిడి, జీవన విధానం, ఎసిడిటీల వల్ల సమాజంలో గుండె జబ్బులు పెరుగుతున్నాయని అన్నారు. గుండె పోటుకు గురైన వ్యక్తిని కాపాడటంలో తొలి గంటా ఎంతో కీలకమని, దీనిని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారని చెప్పారు. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లోని సీహెచ్‌సీల్లో గుండెపోటు బాధితులకు చికిత్స చేయడానికి హబ్, స్పోక్ మోడల్ ఉపయోగిస్తామని తెలిపారు. సీహెచ్‌సీలలో ఐసీయూ, బెడ్, ఈసీజీ యంత్రాలు, మందులు, మానిటర్ల వంటి వైద్య పరికరాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామాల్లో గుండె జబ్బుల బారిన పడిన వారికి సీహెచ్‌సీలలో ముందస్తుగా ప్రథమ చికిత్స చేసి, అనంతరం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ ఎం.సనత్ కుమారి, డాక్టర్ రాణి, హెచ్‌ఓడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

జగ్గంపేట: విషసర్పం కాటు వేయడంతో ఓ కౌలు రైతు మృతి చెందాడు. జగ్గంపేట ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం గుర్రంపాలేనికి చెందిన గంజా మోహనరావు (49) తాను కౌలుకు తీసుకున్న భూమిలో శుక్రవారం వ్యవసాయ పనుల్లో ఉండగా విషసర్పం కాటు వేసింది. దీంతో ఇంటికి వచ్చిన అతడిని కుటుంబ సభ్యులు హటాహుటిన జగ్గంపేట సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టానికి తరలించామని ఏఎస్సై నూకరాజు తెలిపారు.

మెడికల సాకారం

- రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం
- మొదలైన తరగతులు
- తొలి రోజు హాజరైన 70 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు


తొలి రోజు వైద్య తరగతులను బోధిస్తున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ చేరిన వైద్య విద్యార్థులు తొలి రోజు తరగతులకు రెట్టింపు ఉత్సాహంతో హాజరయ్యారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తరగతులు జరిగాయి. వారం రోజుల పాటు ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తారు. అనంతరం జనరల్ బోధన ప్రారంభిస్తారు. నెల రోజుల తర్వాత ల్యాబ్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఇదే తొలి రోజు పాఠం

'వైద్యుడు దేవుడితో సమానం అనే మాటను కచ్చితంగా నిజం చేసేలా వైద్య విద్యార్థులు తయారు కావాలి. వైద్యో నారాయణో హరిః అనే మాటను అక్షరాలా నిజం చేయాలి' అంటూ తొలి రోజు కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు, బోధనోపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. మంచి ర్యాంకులు వచ్చినప్పటికీ విద్యార్థులు ప్రపంచ జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మంచి డాక్టర్‌గా ఎలా ఉండాలి, రోగితో ఎలా ఉండాలనే అంశాలను వివరించారు. మనిషి ప్రాణం కాపాడినప్పుడు వచ్చే ఆనందం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా రాదని, అటువంటి పవిత్ర వృత్తిలో ఎదిగేందుకు దేవుడు అవకాశం ఇచ్చిన అవకాశాన్ని వైద్య విద్యార్థులు సఫలీకృతం చేసుకోవాలని చెప్పారు. కళాశాలలో ఏవిధంగా ఉండాలి, ఏ పద్ధతులు పాటించాలి, వైద్య విద్యార్థుల పాత్ర ఏమిటనే విషయాలను వివరించారు. ఎంతటి విద్యార్థులైనా ఉపాధ్యాయుల ముందు చిన్నవారేనని, మంచి ర్యాంకు వచ్చినా మంచి మనస్తత్వం ఏర్పరచుకోవాలని, మంచి వైద్యులుగా తయారు కావాలని సూచించారు.

పూర్తి స్థాయిలో బోధన సిబ్బంది

నీట్‌లో మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు కళాశాల అధికార యంత్రాంగం నెల రోజులుగా కౌన్సెలింగ్ నిర్వహించింది. మొత్తం నాలుగు విభాగాల్లో సీట్ల భర్తీ దాదాపు పూర్తి చేశారు. ఈ కళాశాలలో మొత్తం 150 సీట్లకు అనుమతి లభించింది. మొత్తం రెండు దశల్లో 120 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇచ్చారు. తరగతులు బోధించేందుకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చారు. వైద్య విద్య బోధనకు మొత్తం 65 మందిని ప్రభుత్వం నియమించింది.

మా ఊరిలో నేనే తొలి డాక్టర్‌ను అవుతా..



మాది ఏజెన్సీలోని మారుమూల పల్లెటూరు. వైద్యం కావాలంటే చాలా దూరం పోవాలి. మా ఊరిలో నేనే తొలి వైద్యురాలినవుతా. చాలా ఆనందంగా ఉంది. కష్టపడి చదువుతా. ఎంబీబీఎస్‌లో మంచి మార్కులు తెచ్చుకుని న్యూరాలజీ చదువుతా.

– గగనశ్రీ, ఎంబీబీఎస్ విద్యార్థిని, పెదసెలగ, విజయనగరం జిల్లా

తరగతులు విజయవంతంగా ప్రారంభించాం



అనుకున్న విధంగానే సెప్టెంబర్ ఒకటో తేదీన రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్య తరగతులు ప్రారంభించాం. విద్యార్థులకు గత నెలలో కౌన్సెలింగ్ పూర్తి చేశాం. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించాం. హాస్టల్ ఏర్పాటు చేశాం. ఇక నుంచి వైద్య విద్య తరగతులు నిరంతరం జీఎంసీలో జరుగుతాయి. అనుకున్న సమయానికి తరగతులు ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు ప్రారంభించింది. ఆ దిశగా కళాశాల వైద్యాధికారులు, ఏపీఎంఐడీసీ అధికారులు కృషి చేశారు.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్

ఆనందం మాటల్లో చెప్పలేనిది



డాక్టర్ అవ్వాలనే నా కల సాకారం కాబోతుంది. కష్టపడి చదవడంతో నాకు ఫ్రీ సీటు వచ్చింది. ఎంబీబీఎస్ తొలి రోజు తరగతులకు హాజరయ్యాను. ఈ ఆనందం మాటల్లో చెప్పలేనిది. నా తల్లిదండ్రులు కన్న కలను నెరవేరుస్తాను. కళాశాలలో అన్ని సౌకర్యాలూ బాగున్నాయి. ఎంబీబీఎస్ పూర్తయ్యాక కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నా.

– ఎస్.విమలాదేవి, ఎంబీబీఎస్ విద్యార్థిని, పిఠాపురం

గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తా..



తొలి రోజు పాఠం మరచిపోలేనిది. ముందుగా మాలో ఉన్న భయాన్ని పోగొట్టారు. మంచి మెళకువలు నేర్పారు. డాక్టర్ అనే పదానికి అర్థం చెప్పారు. మా ప్రొఫెసర్లు చెప్పిన మాటను కచ్చితంగా పాటిస్తాను. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత గైనకాలజిస్ట్‌గా సేవలందించాలనుకుంటున్నాను.

– బ్లెస్సీ, ఎంబీబీఎస్ విద్యార్థిని, కాకినాడ

అస్సలు ఊహించ లేదు



నాకు ఫ్రీ సీటు వస్తుందని అస్సలు ఊహించలేదు. ఇది చాలా ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రుల సహకారంతో వైద్య విద్యలో అడుగు పెట్టాను. విజయవంతంగా పూర్తి చేస్తాను. నా వైద్య విద్యకు అవసరమైన అన్ని సౌకర్యాలూ అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాను. ఆర్థోపెడిక్ వైద్యుడిని కావాలనుకుంటున్నాను.

– మహ్మద్ రజా, ఎంబీబీఎస్ విద్యార్థి, విజయనగరం

వారం రోజుల్లోనే చోరీ సొత్తు రికవరీ

కాకినాడ రూరల్: పట్టపగలే జరిగిన ఓ చోరీ కేసును కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఇంద్రపాలెం పోలీసులు వారం రోజులు తిరగకుండానే ఛేదించారు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రేపూరుకు చెందిన ముర్కొండ దుర్గాప్రసాద్ దంపతులు గత నెల 24న ఇంటికి తాళాలు వేసి, శ్రావణ శుక్రవారం వ్రత సామగ్రి కొనుగోలు కోసం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోని బంగారు ఆభరణాలను దొంగలు దోచుకుపోయినట్టు గుర్తించారు. దీంతో బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు.. ఎస్సై దేవ సుధ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై, సిబ్బంది కేసును అన్ని కోణాల్లో విచారణ జరిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించారు. సరిగ్గా వారం రోజుల్లో.. శుక్రవారం ఉదయం కాకినాడ పాత ఎన్టీఆర్ బీచ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని మధ్యవర్తుల సమక్షంలో ఎస్సై సుధ విచారించగా, వారు నేరం అంగీకరించారు. దీంతో ఈ చోరీ కేసులో విజయవాడకు చెందిన ముద్దాని జగదీష్, మండపేట మండలం జెడ్.మేడపాడుకు చెందిన చింతలపూడి చక్రదొరలను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన 81.5 గ్రాముల బంగారు హారం, బంగారు నెక్లెస్, బంగారు గొలుసు, బంగారు బ్రాస్లెట్‌తో పాటు స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనం కేసులో నిందితులిద్దరూ పాత నేరస్తులేనని సీఐ శ్రీనివాస్ చెప్పారు. జగదీష్‌పై చాలా కేసులున్నాయని, చక్రదొరపై గంజాయి కేసు ఉందని తెలిపారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉండగా వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది. జగదీష్ జూదంతో, చక్రదొర వ్యాపారం చేసి అప్పుల పాలయ్యారు. సులువుగా డబ్బు సంపాదించుకోవచ్చనే ఉద్దేశంతో వీరిద్దరూ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులను రిమాండుకు తరలించారు.

అర్హత ఉంటే చాలు.. పింఛను మంజూరు


లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: టీడీపీ పాలనలో ఆ పార్టీ జెండా మోస్తేనో, నాయకులకు మొక్కే వాళ్లకో పింఛను అందేదని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉంటే పార్టీలకు అతీతంగా పింఛను అందుతోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014–19 మధ్య టీడీపీ పాలనలో ఫించన్ల కోసం రూ.400 కోట్లు వెచ్చిస్తే నేడు సీఎం జగన్ రూ.1,765 కోట్లు వెచ్చిస్తున్నారని చెప్పారు. ప్రతి 50 కుటుంబాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 729 మందికి ఫించన్లు మంజూరు చేశామని తెలిపారు. గడప గడపకూ వెళ్లి, తమ ప్రభుత్వ హయాంలో చేసిన మేలును వివరిస్తున్నామని మంత్రి చెప్పారు.

రౌడీల గ్యాంగ్‌వార్

- పూటుగా తాగి.. ఆధిపత్య పోరు
- ఓ రౌడీషీటర్ హత్య
- మరొకరికి తీవ్ర గాయాలు
- అమలాపురం ఈదరపల్లి శ్మశానంలో ఘటన


హతుడు కిషోర్ (పాత చిత్రం


సంఘటన స్థలంలో కిషోర్ మృతదేహం


అమలాపురంలో దహనమవుతున్న దుకాణం

అమలాపురం టౌన్: పట్టణం సమీపంలోని ఈదరపల్లి గ్రామానికి చెందిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ (24) హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన అడపా సాయి లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈదరపల్లి శ్మశానంలో ఈ సంఘటన జరిగింది. అవివాహితుడైన హతుడు కిషోర్‌పై పట్టణ పోలీసు స్టేషన్‌లో పలు కేసులున్నాయి. ఇటీవల కొన్ని రౌడీ గ్యాంగ్‌లు తరచుగా ఆధిపత్య పోరుకు దిగుతున్నాయి. వీటిల్లో ఉన్న రౌడీలు పూటుగా తాగి, అప్పుడప్పుడు ఘర్షణలకు దిగుతున్నారు. ఇటువంటి ఘర్షణలోనే కిషోర్‌ను ప్రత్యర్థులు మట్టుబెట్టారని పోలీసులు చెప్పారు.

అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ కథనం ప్రకారం.. రౌడీ గ్యాంగ్‌లకు చెందిన కొంత మంది యువకులు తాగిన మైకంలో ఈదరపల్లి రంగా విగ్రహం వద్ద గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఆ గొడవలు రాత్రి సద్దుమణిగాయి. శుక్రవారం ఉదయం వారు మళ్లీ అదే చోట ఘర్షణకు దిగడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి, రంగా విగ్రహం వద్ద ఎవరూ గుమిగూడకుండా చర్యలు చేపట్టారు. ఈలోగా ఈదరపల్లి శ్మశానం వద్ద రౌడీషీటర్ కిషోర్, అతడి స్నేహితుడు అడపా సాయిలక్ష్మణ్‌పై ప్రత్యర్థులు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న కిషోర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. గాయపడిన సాయి లక్ష్మణ్‌ను తొలుత స్థానిక ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నలుగురి పేర్లు వెల్లడి

ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సాయి లక్ష్మణ్‌ను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి ఏరియా ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఈదరపల్లికి చెందిన సతీష్, ఇంద్ర, పట్టణంలోని కొంకాపల్లికి చెందిన రౌడీ షీటర్ ఇండిగుల ఆనంద్, అల్లవరం మండలం గూడాలకు చెందిన సుధీర్‌తో పాటు మరి కొంత మంది తమపై దాడి చేశారని లక్ష్మణ్ తెలిపాడు. వీరిలో ఇండిగుల ఆనంద్ టీడీపీ సానుభూతిపరుడు. టీడీపీ అమలాపురం నియోజకవర్గ నాయకుడు, మాజీ రౌడీ షీటర్‌కు ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. ఈ హత్య తాగిన మైకంలో చెలరేగిన ఘర్షణల వల్లే జరిగిందని డీఎస్పీ అంబికా ప్రసాద్ చెప్పారు. సాయిలక్ష్మణ్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం పోలీసు అధికారులు ఈదరపల్లి శ్మశానం వద్దకు చేరుకున్నారు. ఈ సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై విచారణ జరిపారు. గాయపడిన సాయి లక్ష్మణ్ పరిస్థితిని జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా కూడా స్వయంగా పరిశీలించారు.

రెండు పోలీసు బృందాలు

సాయి లక్ష్మణ్ చెప్పిన ప్రత్యర్థుల ఆచూకీ తెలుసుకునేందుకు ఇద్దరు ఎస్సైలతో కూడిన రెండు పోలీసు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. ఎస్సై హరీష్‌కుమార్, ఎస్సై ప్రభాకర్‌ల ఆధ్వర్యాన రెండు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టాయి. కాగా, ఈ సంఘటనలో హత్యకు గురైన రౌడీషీటర్ కిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కిషోర్ అవివాహితుడు. తరచూ వివాదాలకు దిగుతూంటాడని పోలీసులు చెప్పారు.

హత్యకు నిరసనగా దుకాణం దహనం

రౌడీ షీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్యను నిరసిస్తూ అతడి వర్గానికి చెందిన కొందరు స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న ఓ దుకాణాన్ని శుక్రవారం రాత్రి దహనం చేశారు. సప్తగిరి అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న టీడీపీ నాయకుడు, మాజీ రౌడీ షీటర్ గంధం పల్లంరాజుకు చెందిన ఈ దుకాణాన్ని కిషోర్ వర్గీయులు దహనం చేసినట్టు పోలీసులు గుర్తించారు. దహనమవుతున్న దుకాణం వద్దకు డీఎస్పీ అంబికా ప్రసాద్ చేరుకుని స్థానికులను విచారించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి దుకాణానికి నిప్పు పెట్టినట్టు స్థానికులు చెప్పారు. షాపు దహనానికి పాల్పడిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసును లోతుగా విచారిస్తున్నారు. ఈ ఘటనలో పక్కనున్న దుకాణాలు కూడా పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ఈదరపల్లిలోని సతీష్ ఇంట్లో కిషోర్ వర్గీయులు ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే

- రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- వ్రతమాచరించిన 4 వేల మంది మహిళలు
- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- 8న మరోసారి..


వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం నిర్వహించిన ఈ వ్రతాల్లో వేలాదిగా మహిళలు పాల్గొన్నారు. సత్యదేవుని వార్షిక, నిత్య కల్యాణ మండపాలతో పాటు రామాలయం వద్ద ఉన్న రెండు వ్రత మండపాల్లో మొత్తం ఎనిమిది బ్యాచ్‌లుగా ఈ వ్రతాలు నిర్వహించారు. సుమారు 4 వేల మంది మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రత్నగిరి ప్రాంగణం మహిళలతో కిటకిటలాడింది. వ్రతాలకు వచ్చిన మహిళలకు ఉచితంగా జాకెట్టు ముక్క, సత్యదేవుని ప్రసాదం, అమ్మవారి రాగి రూపు, చేతికి కట్టుకునే తోరం అందజేశారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. వ్రతాలాచరించిన మహిళలు ప్రత్యేక క్యూలో సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం వీరికి నిత్యాన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ, సుధీర్, యడవిల్లి ప్రసాద్, నాగాభట్ల రవిశర్మ, అంగర సతీష్‌శర్మ, పాలంకి పట్టాభి తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

అంచనాకు మించి..

వరలక్ష్మీ వ్రతాలకు అంచనాకు మించి మహిళలు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం 8 గంటలకు వ్రతాలు ప్రారంభించగా 6 గంటల నుంచే మహిళలు రత్నగిరికి చేరుకున్నారు. మండపాలన్నీ మహిళలతో నిండిపోగా, అంతకు రెండింతల మంది బయట వేచి ఉన్నారు. దీంతో రెండేసి బ్యాచ్‌ల చొప్పున వ్రతాలు నిర్వహించారు. వార్షిక కల్యాణ మండపంలోనే మొదటి బ్యాచ్ 800, రెండో బ్యాచ్ 900 మంది మహిళలు వ్రతాలు ఆచరించారు. వ్రతాలను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ నెల 8న మరోసారి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నామని ఈఓ తెలిపారు.

ఉచితంగా న్యాయసేవలు


విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): న్యాయస్థానాలు వివిధ వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) అధ్యక్షురాలు గంధం సునీత అన్నారు. అర్హులందరికీ ప్రతి పథకం అందేలా అవగాహన కల్పించడంలో మీడియా తన వంతు కర్తవ్యం పోషించాలని సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని తన చాంబర్‌లో ఆమె శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, మానవ అక్రమ రవాణా బాధితులు, మహిళలు, పిల్లలు, భిక్షాటన చేస్తున్న వారు, మతిస్థిమితం లేక మానసిక చికిత్స పొందుతున్న వారు, దివ్యాంగులు, ప్రకృతి, ఇతర విపత్తుల్లో చిక్కుకున్న బాధితులు, కార్మికులు, అనైతిక, చట్టంతో విభేదించిన బాలలు, వార్షికాదాయం రూ.3 లక్షలు మించని వారు ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని తెలిపారు. నల్సా పథకం–2015లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. విద్యార్థులకు మంచి, చెడు స్పర్శల మధ్య తేడా తెలియజేస్తున్నామన్నారు. సోదర భావం, దేశభక్తి, జాతీయతా భావం పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో చిత్రలేఖనం, వ్యాస రచన, లలిత కళల పోటీలు నిర్వహించాల్సిందిగా విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అసంఘటిత రంగ కార్మికులకు బీమా భద్రత కల్పించేందుకు ఈ–శ్రమ్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేయించాలన్నారు. భవన నిర్మాణ రంగంలో 3,17,707 మంది అసంఘటిత కార్మికులున్నట్లు గుర్తించామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొర్రేడు, రంగంపేట, కొత్తూరు, నెల్లిపూడి గ్రామాలను వివాద రహిత, ఫిర్యాదు లేనివిగా గుర్తించి, నివేదిక పంపామని చెప్పారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి జిల్లాలోని 15 ప్రాంతాల్లో ఉన్న 64 కోర్టుల్లో ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని సునీత తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. దీని ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు, రాజీ పడదగిన క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇటువంటి కేసులను ఉదయం 10 గంటల నుంచి ఆయా కోర్టుల్లో పరిష్కరించుకోవాలని చెప్పారు. విలేకర్ల సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి కూడా పాల్గొన్నారు.